సాహసం

నాన్నా అన్నయ్యా ఆఫీసుల కెళ్ళారు. తమ్ముడు స్కూలు కెళ్ళాడు. అమ్మా, వదినా వంటింట్లో అప్పడాలు వత్తుతున్నారు. పోనీ పాపం గదా అని తాను కూడా సాయపడదాం కదా అనుకుంటే, "నువు వత్తే వుండలకన్న తినే వుండలు జాస్తిగా వున్నై. నీ సాయం మాకొద్దుపో తల్లీ" అన్నది అమ్మ, పనిచేస్తున్నదన్న మెప్పు కూడా లేకుండా. ఆ మాట అనేసరికి వదినె, "ఉన్నవి రెండే అప్పడాల కర్రలు. నీ కెందుకీ శ్రమ? హాయిగా వెళ్ళి ఏ సినిమా పత్రికైనా, చదూకోక!' అన్నది. అంతంత మాటలు పడ్డాక ఇక తన కక్కడ ఏం పనీ? గ్లాసెడు నీళ్ళు తాగి, ఎందుకైనా మంచిదని మరి రెండు అప్పడాల పిండివుండలు సంగ్రహించి, కారానికి మండిపోతున్న నాలుకకు ఉపశాంతిగా రోజుకుంటూ రాజ్యలక్ష్మి ముందుగదిలోకి వచ్చింది.

గదిలోకి అడుగు పెడుతూనే ఆమెకళ్ళు కిటికీలో పడివున్న ఉత్తరం మీద పడ్డాయి. తీసిచూస్తే కవరు మీద తన పేరేవుంది. తనపేర ఉత్తర రావటం ఇదే మొదలు. ఎవరు రాసివుంటారు? అక్క గుంటూరునుంచి రాసి వుంటుందా? ఎడ్రసు ఇంగ్లీషులో రాసిందెవరూ? బావ దస్తూరి కాదే. ఇంకెవరో రాసివుంటారు. ఉత్తరం మటుకు గుంటూరునుంచే వచ్చింది. అన్నట్టు అక్కదగ్గిరనుంచి నిన్నగాక మొన్ననేగా ఉత్తరం వచ్చింది? ఇల్లు మారుతున్న హడావిడిలో అమ్మకు జవాబు రాసేటందుకైనా పడలేదు. సాయంకాలం జవాబు రాసి పోస్టులో వేయిద్దామనుకుంటోంది. చక్కగా ఈ ఇంటికి పోస్టుడబ్బా చాలా దగ్గిరే కూడానూ – వెనక వుండిన ఇల్లుకు దూరంగానీ!

ఉత్తరం చించి చూస్తేగాని లక్ష్మికి వూపిరి సలిపేలాగు లేదు. అందుచేత చేతిలో వున్న అప్పడాల పిండి గబగబా తినేసి కవరు చించి ఉత్తరం బయటికి లాగి మొదటి మాటలు చూస్తూనే కొయ్యబారిపోయినట్టయింది.

"నా ప్రాణసమానురాలైన రాజ్యానికి"

రాజ్యలక్ష్మి కళ్ళు అప్రయత్నంగా ఉత్తరం చివర సంతకంమీదికి పోయాయి.

"ఇట్లు నీ ప్రేమోపాసి, రంగారావు."

ఎవరో తిడితేనో, గట్టిగా కొడితేనో కలిగే అనుభవంలాంటిది కలిగింది లక్ష్మికి.

కళ్ళు కనబడలేదు. చెవులలో ఏదో హోరు, వంటినిండా చెమటలు, వూపిరి సరిగా ఆడదు. ఎవడీ రంగారావు? వాడు తనకు ఉత్తరం రాస్తాడా? ఎంత సాహసం! ఎన్ని గుండెలు!

ఈ ఉద్రేకం కాస్త ఉపశమించే సమయానికి లక్ష్మికి మరో ఆలోచన కలిగింది. అయినా ఏం రాశాడో చూస్తేనేం? ఎట్లాగూ చించిపారేసే ఉత్తరమేగా?

"నా ప్రాణసమానురాలైన రాజ్యానికి.

చాలా రోజులుగా నీ దగ్గిర నుంచి ఉత్తరం లేదు. జీవితం ఆనంద రహితమై, ఎండదెబ్బకు నెర్రెలుపడ్డ భూమిలాగా ఆశారహితంగా, నిర్జీవంగా ఉన్నది. చల్లని జల్లులాగా నీ సానుభూతి కాస్త కురిపించావంటే మరేమీ చెయ్యకుండానే దీని మీద మళ్ళీ పచ్చిక మొలుస్తుంది. రాజ్యం, ఈ సమయంలోనేనా నువ్వు మౌనంగా ఉండాల్సింది? వెంటనే జవాబు రాయి. రోజులిట్లాగే వుండవు. నాకు మళ్ళీ ఉద్యోగం దొరుకుతుంది. ఒక్కొక్క పుస్తకమే అమ్మేస్తున్నాను కాని ఇంతకి రెండింతలు పుస్తకాలు కొంటాను.

న్యాయంగా నేను ఇతరుల సానుభూతి కోరరాదు. ఎందుచేతనంటే, నా కభ్యంతరం లేని పక్షంలో చేసేటందుకు ఉద్యోగం ఒకటి ఉంది. అది నిరాకరించానని మా బంధువులకూ, కొందరు మిత్రులకూ చాలాకోపం వచ్చింది నా మీద! నూరు రూపాయలిస్తారు గదా అని పరమ దౌర్భాగ్యులదగ్గిరా, సంస్కార హీనుల దగ్గిరా అవమానాలు భరిస్తూ ఎట్లా ఉద్యోగం చెయ్యటం? అట్లా జీవితాన్ని అమ్ముకుని బానిస అయినవాడు భూభారమేకదా?

ఏదైనా పాట రాద్దామని కూచున్నాను. రాయగలిగితే ఈ ఉత్తరంలో పెట్టేవాణ్నే కాని, చెప్పాను గదూ మనస్సు నెర్రెలుపడి ఉంది. పాట కాదుగదా, చిన్న కూత కూడా పలకటం లేదు.

ఈ ఉత్తరం ఎంతో సరదాగా రాద్దామనుకున్నాను. నా ఆర్తనాదం తప్ప ఇందులో ఇంకేమీ లేదు. ఈసారి మంచి ఉత్తరం రాస్తాను.

ఇట్లు, నీ ప్రేమోపాసి, రంగారావు"

ఉత్తరం చదవటం మంచిదయింది. అది పూర్తి చేశాక రాజ్యలక్ష్మికి కలిగిన వికారమంతా తగ్గిపోయింది. ఈ ఉత్తరం తనది కాదు. మరి తనపేర, తన చిరునామాకు ఎట్లా వచ్చిందో తెలియలేదు.

అన్నట్టు తమకు ముందుకూడా ఈ ఇంట్లో తెలుగువాళ్ళే ఉండేవారట. వాళ్ళ కుటుంబంలో కూడా తనపేరుగల మనిషే ఉండేదేమో! తామీ ఇంటికి వచ్చి మూడు రోజులేగదా అయింది? తన నేడిపించటానికి ఎవరన్నా రాశారనుకోవటానికైనా వాళ్ళకి

ఎడ్రస్ తెలిసే అవకాశం ఏదీ? ఈ ఉత్తరం అమ్మగాని, వదినెగాని, మగవాళ్ళుగాని చూస్తే బాగుండదు. అందుచేత దాన్ని రాజ్యలక్ష్మి చించి ముక్కలు చేసి ఇంటిబయట కందకంలో పారేసి వచ్చింది. వంటింటిలోకి వెళ్ళి మరి కాస్త అప్పడాలపిండి తిననారంభించింది.

"మళ్లీ వచ్చారా తల్లీ?" అన్నది వదినెగారు.

దీనికి రాజ్యలక్ష్మి ఏం జవాబు చెప్పివుండేదో గాని ఈ సమయానికే, దేవుడు పంపినట్లుగా, నాలుగోయింటి తెలుగావిడ ద్రౌపదమ్మగారు వచ్చింది.

"అహాహాహా! కారపు అప్పడాలే? ఏమదృష్టమమ్మా! ఎంతసేపటికీ ఈ తెల్ల అప్పడాలేగాని కారం అప్పడాలు ఎరగంగదా!" అన్నది ద్రౌపదమ్మగారు.

"అన్నీ కొనటం అలవాటైపోయాక ఈ మహానగరంలో ప్రతిదానికీ మొహం వాచిపోతున్నాంగాని మనవైపునైతే అప్పడాలు చేసుకోంటండీ?" అన్నది అమ్మ.

"దేనికైనా మనిషికి మనిషి తోడుంటేగాని ఉత్సాహం వుండదు లెస్తురూ. వూరగాయలూ, అప్పడాలూ, వడియాలూ పెట్టుకోవాలని ఎన్నోసార్లనుకుంటా. కాని నడుము బిగించ బుద్ధికాదుగదే. ఈ ఇంట్లో రామాయమ్మ గారున్నప్పుడు ఎన్ని చేసేవాళ్ళం! ఆవకాయలు పెట్టాం. మాగాయలుపెట్టాం. కందిసున్ని కూడా పెట్టాంగా!"

లక్ష్మికి మంచి అవకాశం దొరికింది.

"ఏమండీ, పిన్నిగారూ? వాళ్ళింటోకూడా చాలామంది ఆడవాళ్ళుండేవాళ్ళా?" అన్నదామె.

"చాలామంది ఎవరున్నారూ? రామాయమ్మగారేగా? కూతురుండేదనుకో! అబ్బో ఆవిడంతా నాగరికపు తరహా! ఎంతసేపూ పుస్తకాలు చదవటం, పత్రికలు చదవటం, సినిమాలు, షికార్లూ – అడిగావ్? బియ్యే చదివిందమ్మాయ్! బియ్యే!"

"ఆ అమ్మాయి పేరేమిటండీ?"

"రాజ్యం, రాజ్యం అనేవాళ్ళు. రాజ్యలక్ష్మో ఏదో అయివుంటుంది."

"సరిపోయింది! మా ఆడబిడ్డపేరేనా?" అన్నది వదినె. వత్తిన అప్పడాన్ని వెలుతురుకు పెట్టి పల్చగా వచ్చిందీ లేందీ పరిశీలిస్తూ.

"పేరులో ఏముందమ్మా? ఈ పిల్లముందు ఆ పిల్ల ఎందుకు పనికొస్తుందీ! ఊరికే పౌడర్లు పామగానే సరా ఏమిటి? ఈ పిల్ల అందమెక్కడ, ఆ పిల్ల అందమెక్కడ! ఇంతకీ నాకో పాతిక అప్పడాలిస్తున్నారా, ఇవ్వటంలేదా? డబ్బిచ్చుకుంటాలేవమ్మోవ్! నాకు ఊరికే వద్దులే!"

2

ఒకటి రెండు రోజులపాటు రాజ్యలక్ష్మికి రంగారావు ఉత్తరం గురించి క్షణ క్షణమూ జ్ఞాపకం వస్తూండేది. అందులోని వాక్యాలు బుర్రలోకి వస్తూ, చేసే ఆలోచనల్ని కూడా పాడుచేసేవి. ఆమె పరధ్యానాన్ని దాదాపు అందరూ గమనించారు. దానిమీద వ్యాఖ్యానించారు. అయితే రాను రాను చెప్పు పుండు కాయగాచి పోయినట్లు రంగారావు ఉత్తరం గురించిన భావాలు మొద్దుబారిపోయాయి. క్రమంగా వాటిని గురించి బాధపడటం మానేసింది లక్ష్మి.

లక్ష్మి జీవిత రామాయణంలో రంగారావు ఉత్తరం పిడకలవేట ముగిసినట్టే కనపడిన సమయంలో రంగారావు దగ్గిరనుంచి మరో ఉత్తరం వచ్చింది. అదృష్టవశాత్తూ అదికూడా ఇతరులకంట పడకుండానే లక్ష్మికి దొరికింది. అయితే ఇది చాలా చిన్న ఉత్తరం.

"రాజ్యం, నా ఉత్తరం అందలేదా? సమాధానం రాశావుకావేం? నీ ఉత్తరం కోసం నేనెంతగా తపిస్తున్నానో తెలుసుకొని ఏడిపిద్దామని చూస్తున్నావా? లేక తెలియక నీకేమయినా అపచారం చేశానా?

– నీ రంగారావు"

ఈ ఉత్తరం చదవగానే లక్ష్మికి పట్టరాని కోపం వచ్చింది. ఆ రంగారావుమీద అసహ్యం పుట్టుకొచ్చింది. మగాళ్ళంతా ఇంతే. అందని ఆడదంటే వాళ్ళకి అంత గౌరవం! పెళ్ళాం అంటే ఛీ, సిగ్గుమాలిన వాళ్ళు! ఆమె రంగారావునూ ఎరగదు, రాజ్యాన్నీ ఎరగదు. కాని రాజ్యం రంగారావు ఆరాధనకు ఎంతమాత్రం తగదని లక్ష్మి అంతరాత్మ ఢంకా బజాయించి చెబుతోంది. ఈ ఆరాధన మూలంగా రంగారావుమీద కూడా ఆమెకు జుగుప్స కలగసాగింది. లక్ష్మి రంగారావుకొక ఉత్తరం రాసి పడేద్దామని అనుకుంది. రాత్రిపూట అందరూ నిద్రపొయ్యేటప్పుడు కాగితమూ కలమూ తీసుకుని రంగారావు ఎడ్రసుకు, చిన్న ఉత్తరం రాయబూనుకున్నది. కాని, ఈ పని అనుకున్నంత తేలిక కాదని రూఢి అయింది. చేతులు వణికాయి. అక్షరాలు బీభత్సంగా తయారయాయి. ముచ్చెమటలు పోసి కాళ్ళు చల్లబడసాగాయి. రాసినంతవరకు చదివింది.

"రంగారావుగారూ, మీ రాజ్యం ప్రస్తుతం ఇక్కడ ఉండటంలేదు. వాళ్ళు మరో ఇంటికి వెళ్ళిపోయారు. దయచేసి మీ ఉత్తరాలు ఈ చిరునామాకు రాయవద్దు. ఏమయినా మీరు చాలా వెర్రిన పడుతున్నారని చెప్పసాహసించే –"

ఏమిటీ ఉత్తరం? తన కెందుకొచ్చిన క్షోభ! రేపు కవరు సంపాదించి దీన్ని పోస్టు

చేసేలోపుగా ప్రపంచమంతా ఈ ఉత్తరం చదివేస్తుంది! అందులో ఏమీ సందేహం లేదు. లక్ష్మి అతి జాగ్రత్తగా రాసిన కాగితం చించి ముక్కలు ముక్కలు చేసి బయట పారేసింది.

మరి మూడు మాసాలు గడిచాయి. రంగారావు మళ్ళీ ఉత్తరం రాయలేదు.

3

"ఆరోనెల దాటుతుంది. అమ్మాయిని తీసుకురావద్దుటండీ?" అన్నది అమ్మ నాన్నతో. ఈ మాట చెవిన పడగానే లక్ష్మి పదేళ్ళ పిల్ల అయిపోయింది. ఈ శక్తి అందరికీ వుందో లేదోగాని లక్ష్మికి వుంది. లక్ష్మి జీవితంలో "నిన్న జరిగినట్టు" తోచే సంఘటనలు కొన్ని వున్నాయి. ఉదాహరణకు లక్ష్మి అయిదేళ్ళ పిల్ల అయి వుండగా బోటు ప్రయాణం చేసింది. తరవాత ఎప్పుడు రహదారిబోటు చూసినాసరే క్షణికంగా అయిదేళ్ళ పిల్ల అయిపోతూండేది. అట్లాగే అక్క పెళ్ళికి లక్ష్మి పదేళ్ళది. అక్క వివాహ జీవితానికి సంబంధించిన విషయం ఏది వచ్చినా ఆమె పదేళ్ళపిల్ల అయి అక్క మధుపర్కాలు కట్టుకుని వుండగా తోడి పెళ్ళికూతురుగా తాను పక్కన నిలబడి వుండటం ఆమెకు జ్ఞాపకం వస్తుంది. ఈ దృశ్యంతో బాటు గంధం వాసన, పన్నీరు వాసనా, పునుగు వాసనా, అగరు వత్తుల వాసనా, పెళ్ళి పందిరి వాసనా కూడా లక్ష్మికి స్ఫురణకు వస్తుంది... అక్క తొలిసారిగా కడుపుతో వుంది. కాన్పుకు పట్నం తీసుకొస్తారు. అక్క కళ్యాణం బొట్టు పెట్టుకుని నిన్ననే పెళ్ళికూతురైనట్టుగా వుంది, అప్పుడే పిల్లతల్లి! తన ఈడప్పుడే అక్కకు పెళ్ళయిపోయింది. తనకే ఇంకా కాలేదుగాని!....

"అమ్మాయిని ఎప్పుడైనా తీసుకురావచ్చు. ఎప్పుడు వీలవుతుందంటాడో అల్లుడికి రాసి కనుక్కుందాం!" అన్నాడు నాన్న.

"మరిచిపోకుండా రాయండి" అన్నది తల్లి.

"అమ్మాయిని గుంటూరునుంచి నేను తీసుకొస్తా" అన్నాడు అన్నయ్య.

"అట్లాగే పోదువుగాని" అన్నాడు నాన్న.

"నేను కూడా పోతా!" అన్నాడు తమ్ముడు.

"నువ్వెందుకు? నేను పోతా" అన్నది లక్ష్మి.

"ఇంకేం ఇంటిల్లిపాదీ పోదాం! దొరికారు పరమానందయ్య శిష్యులు! ఒక్కసూది తీసుకురావటానికి ఏడుగురు బయల్దేరారుట!" అన్నది అమ్మ.

"అమ్మకి ఛాన్సు దొరికింది. పరమానందయ్య శిష్యులు సినారియో రాయటానికి!" అన్నాడు తమ్ముడు. లక్ష్మి కేసి కన్ను మలుపుతూ

"నోరు మూసుకోరా, కుంకయ్యా!" అన్నది అమ్మ........

ఆ మర్నాడో, మూడోనాడో తలవనితలంపుగా లక్ష్మి తన పేరుగల పిల్లను స్వయంగా చూసింది. ఆ అమ్మాయీ వాళ్ళ నాన్నా ద్రౌపదమ్మగారింటికి వచ్చారు. వాళ్ళని ద్రౌపదమ్మగారు లక్ష్మి వాళ్ళ ఇంటికి తెచ్చింది.

"రాజ్యం" మొహం చూడగానే లక్ష్మికి జెర్రులు పాకినై. కారణం ఆమెకే తెలీలేదు. లక్ష్మికి ఆమెలో ఏ ఆకర్షణా కనపడలేదు. మొహం ముచ్చల్లే ఉన్నది. కళ్ళు పెద్ద కళ్లేగాని వాటిలో కాంతి లేదు. వయస్సు ఇరవైదాకా ఉండొచ్చు. చాలానిక్కుగల మనిషి. మాట్లాడిన రెండు మాటలూ తాననేదానికి తిరుగులేదన్నట్లుగా మాట్లాడుతుంది.

"ఈ మనిషిలో ఏం చూశాడో ఆ రంగారావు. అయినా వాడెటువంటివాడో!" అనుకున్నది లక్ష్మి.

"నీ రహస్యం నాకు తెలుసు!" అని ఎట్లాగైనా ఆ పిల్లకు తెలియజేయాలని లక్ష్మి లోలోపల తహతహలాడి పోతున్నది.

"వాళ్ళ రాజ్యానికి సంబంధం కుదిరిందండోయ్!" అన్నది ద్రౌపదమ్మగారు లక్ష్మి తల్లితో.

"అట్లాగేం?" అన్నది అమ్మ సంతోషం అభినయిస్తూ.

"ఈ అమ్మాయి ఇంటరు పాసయింది. పిల్లాడు కూడా బాగా చదువుకున్న వాడేలెండి. ఎమ్మే పాసయి అయిదొందలు తెచ్చుకుంటున్నాడు."

"నా సామిరంగా!" అన్నది లక్ష్మి రౌడీవేషంగా. ఆమె గుండెలు గుబగుబ లాడుతూనే ఉన్నప్పటికీ, యేదో ఒకటి అనకుండా వుండలేకపోయింది. అయినా లక్ష్మి ప్రయత్నం వ్యర్థమైనట్టు కనపడింది, రాజ్యం తానన్నమాట వినిపించుకున్నట్లు కూడా లేదు. వినిపించుకుని లక్ష్మి కేసి ఆశ్చర్యంగా చూసిన మనిషి అమ్మ ఒకత్తే.

"ఏమిటే, అమ్మాయ్!" అన్నది అమ్మ.

"పెళ్ళి చేసుకుంటే మంచి సంపాదన ఉన్నవాణ్ణే చేసుకోవాలి, నిరుద్యోగుల్ని దేనికి!" అన్నది లక్ష్మి. తన గుండెదడను ఖాతరు చెయ్యకుండా.

ఈ సారి రాజ్యం లక్ష్మి కేసి కోరచూపు చూసింది. కాని ఒకంతట తొణికే ఘటం కాదు. రాజ్యం మీద లక్ష్మికి యేదో కొంత గౌరవం కూడా కలగసాగింది. ఆమె తనకన్న రెండు మూడేళ్ళే పెద్దదైనా, కనీసం పదేళ్ళు పెద్దదానిలా ప్రవర్తిస్తోంది. తను కూడా అంత నిబ్బరం నేర్చుకోవాలి. ఎంత నిబ్బరం లేని మనిషి కాకపోతే రంగారావును వెధవను చేసిందా?

"ఈ లోపల గుంటూరు నుంచి మావాళ్ళు కూడా వస్తారు" అన్నది లక్ష్మి ఆఖరు ఛాన్సుగా.

మళ్ళీ "రాజ్యం" లక్ష్మి కేసి ఇందాకటిలాగే చూసింది.

"మా పెద్దమ్మాయిని పురిటికి తెస్తున్నాంలెండి!" అన్నది అమ్మ, లక్ష్మి అయోమయం సంభాషణ ద్రౌపదమ్మగారికి విశదపరుస్తూ.

"చెప్పరేం!" అన్నది ద్రౌపదమ్మ.

వచ్చినవాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ రోజే లక్ష్మి "రాజ్యం" పెళ్ళి శుభలేఖ కవరుమీద నాన్నపేరు కొట్టేసి రంగారావు పేరూ, చిరునామా రాసి, ముక్కానీ బిళ్ళ అంటించి దగ్గిరిలో ఉన్న పోస్టు డబ్బాలో స్వయంగా పడేసి చేతులు దులుపుకుని ఇంటికి చక్కా వచ్చింది.

4

పన్నెండో తేదీ తరవాత వచ్చి అక్కను తీసుకుపోవచ్చునని బావ రాశాడు. పదమూడో తారీకు బాగుంది. ఆనాడు అన్నా, వదినా బయలుదేరి గుంటూరు ప్రయాణం కావటం ఖాయమయింది. తమ్ముడు తనుకూడా వెళ్ళితీరాలన్నాడు. అందుచేత తను కూడా వెళ్ళితీరాలన్నది లక్ష్మి. అంతేగాని తనను వెళ్ళనిస్తారనిగానీ, తాను వెళుతుందని గాని లక్ష్మికి ఏకోశానా లేదు.

తలవని తలంపుగా ఎనిమిదో తారీఖున "రాజ్యలక్ష్మి" పేర ఒక ఉత్తరం వచ్చింది. ఉత్తరం వచ్చేసరికి ఆడవాళ్ళు భోజనాలకు కూర్చోబోతున్నారు. బయటి వాకిలివేసి లక్ష్మి లోపలికి పోబోతుండగా కిటికీలో టప్పుమని చప్పుడయింది. పక్కగది కిటికీలో కార్డు పడి ఉంది. దానిమీద మళ్ళీ తన పేరే ఉంది! దస్తూరి వేరు. రంగారావు దస్తూరి మటుకు కాదు.

లక్ష్మి గబగబా ఉత్తరాన్ని పుస్తకాల మధ్య దాచి భోజనానికి వెళ్ళింది. భోజనాల అనంతరం ఆ ఉత్తరం చదువుకునేటందుకు లక్ష్మికి పడనేలేదు. అది చదువుకోవటం కోసం లక్ష్మి ఆ సాయంకాలం ఒంటరిగా షికారుకు బయలుదేరవలసి వచ్చింది.

"ఎక్కడికే?" అన్నది తల్లి.

"ఏమీ తోచటం లేదు, పార్కు దాకా నడిచి పొద్దూకే లోపలే తిరిగొస్తా!" అన్నది లక్ష్మి. రెండు వీధి మలుపులు తిరిగేదాకా లక్ష్మి ఉత్తరం పైకి తీయలేదు. ఆ తరవాత ఈ విధంగా చదువుకున్నది!

"మాపాలిట శనిదేవత అయిన రాజ్యలక్ష్మి దేవిగారికి: మీరు దయతో పంపిన మీ పెళ్ళి శుభలేఖ అందింది. అది చూసిన క్షణం నుంచీ మా అన్నయ్య రంగారావు 105 డిగ్రీల జ్వరంతో వొళ్లు తెలియకుండా పడి ఉన్నాడు. మీరు మాకుచేసిన మహోపకారం తరతరాలు చెప్పుకుంటాం. ఇట్లు, కృతజ్ఞుడు వెంకటేశ్వర్లు."

ఈ ఉత్తరం చూసి లక్ష్మి నీరసించి పోయింది. ఆమె కాళ్లల్లో సత్తువ యావత్తూ పేవ్‌మెంటులోకి ఇంకిపోయినట్టయింది. తలలో అలారం కొడుతున్నట్టయింది. పక్కగా వెళ్లే కార్ల చప్పుళ్ళు కూడా నూతిలోనుంచి వినిపిస్తున్నట్టు తోచింది.

తాను ఏంపని చేసింది? ఆ శుభలేఖ రంగారావుకు తానెందుకు పంపవలసి వచ్చిందో ఎంత ఆలోచించినా బోధపడలేదు. రంగారావు ఈ దెబ్బతో చచ్చిపోతాడా? తాను హంతకురాలవుతుందా?

లక్ష్మి అంతరాత్మ ఈ ఆలోచనలపై ఎదురు తిరిగింది. తాను శుభలేఖ పంపకపోతే మాత్రం అతనికి ఎప్పటికైనా ఈ పెళ్ళి గురించి తెలియకపోదు గదా! అప్పుడైనా ఈ జ్వరం వచ్చేదే! రంగారావు ఒక క్షుద్రురాలికోసం చావదలిస్తే అది తన తప్పా! చావనీ... కాని తానా శుభలేఖ పంపకపోతే అతని చావుతో తనకేం సంబంధం ఉండదు గద. ఆ పాడుపని తానెందుకు చేయవలసి వచ్చింది?

ఆ ప్రశ్నకు సమాధానం తెలుసుకునే తెలివి లక్ష్మికి లేదు. మనమైనా ఒక్కమాటే అనుకోవాలి! "నువు ప్రేమించిన స్త్రీ చూడు ఏం చేస్తున్నదో?" అని రంగారావుకు తెలియజెప్పటానికే లక్ష్మి శుభలేఖను అతనిపేర పోస్టుచేసి ఉండాలి – ఒక మగవాడు ఎవరో ఆడదాన్ని అంతగా ప్రేమిస్తున్నట్టు తెలుసుకుని లక్ష్మికి ఆ ఆడమనిషి మీద అసూయ కలిగిన మాట మటుకు నిజం. ఆ అసూయను లక్ష్మి అసూయ రూపంలో పైకిరానివ్వలేదు. తన అసూయకు కారకుడైన రంగారావుకు నొప్పి కలిగించాలని కూడా ఆమె శుభలేఖను అతనికి పంపి ఉండవచ్చు.

ఏమైనా ఇప్పుడు లక్ష్మి చాలా పశ్చాత్తాప పడసాగింది. రంగారావుకు కలిగిన విపత్తుతో తనకేమీ సంబంధంలేదని లక్ష్మి తన అంతరాత్మను నమ్మించలేకపోవటం వల్ల పశ్చాత్తాపం పై చెయ్యి అయింది.

"నేను కూడా గుంటూరు వెళతాను. సాధ్యమైతే రంగారావును ఒక్కసారి – ఒక్క నిమిషంపాటు – చూస్తాను" అని నిశ్చయించుకుంది లక్ష్మి.

ఇందువల్ల కలిగేదేమిటో లక్ష్మికి తెలియదు. ఒకవేళ గుంటూరు వెళ్ళినా తాను ఒంటరిగా బయలుదేరి రంగారావును చూడటం సాధ్యపడుతుందని లక్ష్మికి నమ్మకంలేదు. కాని తాను గుంటూరు బయలుదేరే పక్షంలో ఆమె అంతరాత్మ శాంతించేటట్టు కనబడింది. ఈ లోపుగా రంగారావు చచ్చేపోవచ్చు. అయినా –

"అమ్మా, అన్నా వాళ్ళతో నే కూడా గుంటూరు పోవద్దూ?" అన్నది లక్ష్మి ఆ రాత్రి.

"ఎందుకమ్మా, ఇంతమందీ?" అన్నది అమ్మ.

"కాదు, నేను వెళ్ళాలి!"

లక్ష్మి గొంతులో వుండే ఆవేదన చూసి తల్లి, "చూద్దాంలే!" అన్నది.

ఎవరు ఎన్ని చెప్పినా లక్ష్మి మంకుపట్టుపట్టి గుంటూరు వెళ్ళి తీరాలనటం చేత వదినె తన ప్రయాణం మానుకున్నది. గుంటూరుకు అన్నా చెల్లెళ్ళు మాత్రమే బయలుదేరారు.

"నువే వెళ్ళిరావమ్మా! సగం టికెట్టు ఆదా!" అన్నది వదినె లక్ష్మిని పీడిస్తూ.

"నువే అరటిక్కెట్టు: నేనేం కాదు!" అన్నది లక్ష్మి.

"ఊరికెళ్ళటానికి నువు చేస్తున్న హంగామా చూస్తే రైలువాళ్ళు నీ దగ్గిర పూర్తి టిక్కెట్టు పుచ్చుకోరు" అన్నది వదినె.

"అట్లా ఉడికిస్తే నేను మానేసి నిన్ను పంపిస్తాననా? పాపం, ఆశే!" అన్నది లక్ష్మి పన్నెండేళ్ళ పిల్ల ఐపోతూ.

"లేదమ్మా, తల్లీ! నేను పోనేపోను! నువే వెళ్ళు!" అన్నది వదినె.

5

లక్ష్మి గుంటూరు చేరి అప్పుడే ఇరవై నాలుగ్గంటలయింది. ఆమె వచ్చింది అరండల్ పేటకు. రోడ్డుదాటితే బ్రాడీపేట. అందులో యెక్కడో ఉన్నాడు రంగారావు. తనలో పోతన్నగారు చెప్పిన "భీకరశత్రువులు" లేకపోతే అక్కగారింటినుంచి బయల్దేరి గుర్రబ్బండీలో వెళ్ళి రంగారావింటి ముందు దిగటానికి గట్టిగా అయిదు నిమిషాలు పట్టదు. కాని ఈ పని చేయటానికి అవసరమైన సాహసం లక్ష్మిలో కొంచెం కూడా లేనట్లు కనబడింది. తన స్థితిలో రంగారావును వెతుక్కుంటూ పోవటం కంటె ఎర్రగా కాల్చిన కర్రతో వాతలు పెట్టించుకోవటం ఎంతో సులభమైన పనిగా తోచింది.

అయినా లక్ష్మి రెండోరోజు సాయంకాలం రంగారావును వెతకటానికి బయలుదేరనే బయల్దేరింది. పరిస్థితి అనుకూలించటం వల్ల ఆమె ఆ పని చేయగలిగింది. అంతే.

అక్కకు శారద అని ఆడబిడ్డ ఉంది. పదేళ్ళ పిల్ల. శారద సాయంకాలం అయిదుకు ఇల్లు బయలుదేరింది. ఆ పిల్లకు బ్రాడీపేటలో స్నేహితురాలుందిట.

"నా కేమీ తోచటం లేదు. నేను కూడా రానా, శారదా?" అన్నది లక్ష్మి.

"ఓ" అన్నది శారద.

ఇద్దరూ బయలుదేరారు. శారద ఒక రోడ్డు వెంబడి దారితీసింది. నడిచి నడిచి చివరకు గమ్యస్థానం చేరుకున్నారు – శారద గమ్యస్థానం. శారద లక్ష్మిని తన స్నేహితురాలికీ, వాళ్ళ అమ్మకూ పరిచయం చేసింది. లక్ష్మి కొంచెం సేపు కూచున్నది. శారదా ఆమె స్నేహితురాలూ చదువు విషయాలలో నిమగ్నులై ఉండగా లక్ష్మి చల్లగా లేచింది. "నే నింటికి పోతాను శారదా! దారి జ్ఞాపకం ఉందిలే" అన్నది. శారద పరధ్యానంగా తల ఊపి, స్నేహితురాలితో మాట్లాడుకు పోసాగింది.

లక్ష్మి రోడ్డుపేర్లు అడుగుతూ బయలుదేరింది. రంగారావుండే రోడ్డు చేరుకోవటానికి ఆమెకు సరిగా నాలుగు నిమిషాలు పట్టింది. రంగారావుండే యింటిని నంబరు బట్టి తెలుసుకోవటానికి మరో మూడు నిమిషాలు పట్టింది. గుండెల్లో రైళ్ళు పరిగెడుతూ లక్ష్మి తన గమ్యస్థానం బయట నిలబడింది. ఆ ఇల్లు పేదగానే ఉంది. ఇంట్లో ఎవరూ ఉన్నట్లు లేదు. ఆమెచేయగలిగిందేమీ కనిపించలేదు.

వెనుకపాటున సైకిల్‌బెల్ చప్పుడు విని లక్ష్మి ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది. ఒక కుర్రవాడు దాదాపు తన యీడువాడే, సైకిల్ దిగి ఆమెను చూసి ఆగి, "ఎవరు కావాలి?" అన్నాడు.

లక్ష్మినోట మాటరాలేదు. ఎవరూ అక్కర్లేదన్నట్టు తల అడ్డంగా ఆడించింది. అక్కణ్ణుంచి పారిపోదామనిపించింది గాని కాళ్ళు చచ్చుబడ్డాయి.

"మీ పేరు?" అన్నాడా కుర్రవాడు.

"లక్ష్మి! రాజ్యలక్ష్మి!" అన్నది హీనస్వరంతో.

ఈ మాట వినగానే ఆ కుర్రాడిలో కలిగిన మార్పు వర్ణనాతీతం. ఒక్కసారి కొయ్యబారిపోయినాడు. ముఖం వెలవెలపోయింది. మరుక్షణం మొహమంతా ఎర్రగా కందగడ్డ అయిపోయింది.

అతి బలవంతంగా మాట్లాడుతూ, "నా పేరు వెంకటేశ్వర్లు, ఎప్పుడొచ్చారు?" అన్నాడు.

"నిన్న వచ్చా!"

తనను ఈ కుర్రాడు ఎవరనుకుంటున్నాడో లక్ష్మికి అర్థమయింది. కాని అతని అపోహ ఎట్లా పోగొట్టాలో, పోగొట్టిన అనంతరం తానక్కడికి ఎందుకు వచ్చిందీ ఎట్లా వివరించాలో లక్ష్మికి తెలియలేదు. అంతా వివరించవచ్చు, ఈ రోడ్డుమీద కాదు. ఒకటి రెండు వాక్యాలలో అంతకన్నా కాదు.

"లోపలికి వస్తారా? అన్నయ్య డాక్టర్ దగ్గిరికి వెళ్ళాడు. యింకో పావుగంటలో వస్తాడు" అన్నాడు వెంకటేశ్వర్లు.

"రంగారావుగారి కెట్లా ఉంది?" అన్నది లక్ష్మి.

"కొంచెం నింపాదిగానే ఉంది" అంటూ కుర్రాడు తలవాకిలి తలుపు తెరిచి ఇంట్లోకి దారితీశాడు. లక్ష్మి పిల్లిలాగా అతన్ని అనుసరించింది.

ఇల్లు కొంచెం లోపలగా ఉంది. ఇంటి వాకిటి బయట అరుగులున్నై. ఒక అరుగుమీద లక్ష్మి చతికిలబడి చీరె చెంగుతో మొహం తుడుచుకున్నది.

"లోపలికి వచ్చి కూచోవచ్చు. మా అమ్మమ్మను కాస్త కాఫీ పెట్టమంటాను" అన్నాడు వెంకటేశ్వర్లు. అతని గొంతులో ఆగ్రహం ఏమీ లేదు.

"ఫరవాలేదు. ఇక్కడ బాగానే ఉంది" అన్నది లక్ష్మి.

వెంకటేశ్వర్లు కూర్చోలేదు. లోపలికి పోనూలేదు. వాకిలి దగ్గిరే ఎటూ తోచనట్లు నిలబడి ఒక క్షణం వుండి, "మీ పెళ్ళి యింకా నాలుగు రోజులే ఉన్నట్లుంది" అన్నాడు.

"లేదు! నా – నా పెళ్ళి ఇప్పుడప్పుడే లేదు" అన్నది కంగారుగా.

మొట్టమొదటిసారిగా వెంకటేశ్వర్లు మొహాన చిరునవ్వొకటి వెలిసింది. అతను లోపలికిపోతూ, "మీరు లోపలికొచ్చి కూర్చుంటే బాగుంటుంది. నేనిప్పుడే వస్తున్నా" అని వెళ్ళాడు.

లక్ష్మికి క్షణమొక యుగంగా వుంది. వెంకటేశ్వర్లు లోపలికి వెళ్ళటం తనకేదో విమోచనం అయినట్టయింది. ఆ రంగారావు రాకముందే తాను వెళ్ళిపోవటం మంచిది. అతను కోలుకున్నాడు. తన బరువు తీరిపోయింది. ఇంకెందుకొచ్చిన అనవసర తగలాటం? లక్ష్మి చివాలున లేచింది. తాను, ఆ "రాజ్యం" వెళ్ళిపోతున్నానన్న విచారం తప్ప ఆమె కింకేమీ లేదు. అయినా అదంత ముఖ్య విషయం కాదు. తన జన్మలో తాను వీళ్ళని చూసేదిలేదు; వాళ్ళు తనను చూసేది లేదు.

నాలుగంగల్లో లక్ష్మి, ఎవరో తరుముకొస్తున్నట్లుగా తలవాకిలి దగ్గిర వచ్చి పడింది. సరిగా ఆ సమయానికే గుర్రబ్బండీ ఒకటి వచ్చి వాకిట ఆగింది. అందులో నుంచి నీరసంగా, జబ్బుగా కనిపిస్తున్న యువకుడొకడు, చేతిలో మందుసీసా పట్టుకుని దిగాడు. తన యింట్లోనుంచి వీథిలోకి వచ్చిన పరాయిపిల్లను సయితం అతను గమనించినట్టు కనపడలేదు. కాని అతన్ని లక్ష్మి శ్రద్ధగా పరికించింది.

అతనే రంగారావయితే, అతనికంటె అందమైన యువకుణ్ని లక్ష్మి ఎన్నడూ చూడలేదు....

6

అక్కను పట్నం తెచ్చారు. నెల గడిచింది. ఆమెకు సూడిదలు చేశారు. లక్ష్మికిప్పుడు ప్రతిరోజూ ఒక పర్వదినంగా గడిచిపోతోంది. రాజ్యం పెళ్ళి ఆర్భాటంగా అయిపోయిందిట! పెళ్ళి కొడుక్కు కొంచెం బట్టతలట. నల్లగా, లావుగా ఉంటాట్ట. నవ్వితే భూమ్యాకాశాలు దద్దరిల్లుతాయట! ద్రౌపదమ్మగారు గొప్పగా వర్ణించింది. ఆవిడ అంచనా ప్రకారం ఎంత డబ్బు ఖర్చు చేసి చేస్తే అంత గొప్ప పెళ్ళి.

అక్క పట్నం రావటం ఇదే మొదటిసారి. కనీసం రోజువిడిచి రోజు ఏదో ఒక వైపు పోవాలని ఉబలాటపడేది – ఓపలేని మనిషయినా.

ఒకనాడు సాయం కాలం అక్కా, లక్ష్మి, తమ్ముడూ సినిమాకు ప్రయాణం కట్టారు.

లక్ష్మి స్నానాలగదిలో సబ్బేసి ముఖం కడుక్కుంటున్నది. ముందు గదిలో అద్దం ముందు నిలబడి తమ్ముడు శ్రద్ధగా క్రాపు దువ్వుకుంటున్నాడు.

"ఎవరండీ లోపలా?" అన్న పిలుపు వరండాలోనుంచి వినిపించింది.

తమ్ముడు బయటకొచ్చాడు. ఎవరో కొత్త మనిషి కనిపించాడు. అతన్ని చూస్తూనే తమ్ముడు తన మనస్సులో, "సినిమాస్టార్ లాగున్నాడే!" అనుకున్నాడు.

"ఈ ఇంట్లో ఇప్పుడెవరుంటున్నారు" అని అడిగాడు. తమ్ముడు చెప్పాడు.

"ఈ ఇంట్లో రాజ్యం అనే అమ్మాయి ఉంటున్నదా?" అన్నాడా యువకుడు.

"రాజ్యం కాదు, లక్ష్మి" అన్నాడు తమ్ముడు గర్వంగా.

ఆ సమయానికే లక్ష్మి ముఖం తుడుచుకుంటూ బయటికి వచ్చింది. ఒక క్షణంపాటు ఆమె గుంటూరులో గుఱ్ఱబ్బండి దిగుతూ కనిపించిన జబ్బు మనిషిని గుర్తించలేదు. అతనికి ఏ జబ్బూలేదు. చక్కగా పూడాడు. ఇంకా అందంగా ఉన్నాడు.

లక్ష్మిని మాత్రం రంగారావు గుర్తించనేలేదు. అతను మొదటిసారిగా ఆమెకేసి చూస్తున్నాడు.

"నీ పేరేనా రాజ్య - లక్ష్మి?"

లక్ష్మికి నోట మాటరాలేదు. అతను ఆమె జవాబు కోసం ఎదురుచూడనూ లేదు.

"నాకంతా అర్థమయింది. మా వెంకటేశ్వర్లు పొరపడ్డాడు. నా కోసం శ్రమపడ్డందుకు థాంక్స్! వీలుంటే మీ పెద్దవాళ్ళతో రేపో ఎల్లుండో మాట్లాడతాను" అంటూ వచ్చినవాడు వెళ్లిపోయాడు.

తరవాత రెండు మూడు రోజులకు నాన్న ఇంటికి వస్తూనే అమ్మతో. "ఎవరే ఆ అబ్బాయీ? మొన్నెప్పుడో మనింటిక్కూడా వచ్చాట్ట. లక్ష్మిని పెళ్ళి చేసుకుంటానని కూచున్నాడు! ఈ మధ్య ఉద్యోగం లేకుండా ఉన్నాట్ట. ఇప్పుడు మళ్ళీ సంపాదించాట్ట! లక్ష్మి వంటివాళ్లు కోటికొకళ్లు కూడా ఉండరన్నాడు. దీని విషయం అతని కెట్లా తెలుసూ?" అన్నాడు అయోమయంగా.

అంతావింటున్న లక్ష్మి, "ఈ మారుమనువు సంబంధం నాకేమీ అక్కర్లేదు!" అన్నది.

లక్ష్మి దొరికిపోయింది. అక్కా, వదినా, అమ్మా చుట్టూ చేరి లక్ష్మి చేత జరిగినదంతా చెప్పించారు. లక్ష్మిని వేళాకోళం చేశారు. చిట్టచివరికి ఈ సంబంధానికి ఒప్పుకోవచ్చునని సలహా ఇచ్చారు.

రంగారావు రెండు మూడు సార్లు వచ్చాడు. వచ్చినప్పుడల్లా, "అడుగో మీ ఆయన వచ్చాడు" అని వదినె వేళాకోళం చేసేది.

ఒక్కసారి లక్ష్మితో ఒంటరిగా మాట్లాడతానన్నాడు రంగారావు. పెద్దవాళ్ళు సరే నన్నారు.

రంగారావు లక్ష్మితో ఏవో చాలా విషయాలు మాట్లాడాడు. రాజ్యం విషయం కూడా చెప్పాడు. మొదటగా ఆమె తనకు ఉత్తరం రాసి మోసగించిందన్నాడు. తనకూ రాజ్యానికీ మధ్య ఉత్తరాలు తప్ప ఇంకేమీ నడవలేదన్నాడు. తన కోసం జాలిపడి చూడవచ్చిన లక్ష్మి కన్న తనకు ప్రపంచంలో ఆప్తులెవరూ లేరన్నాడు. ఆమె చేసిన పని చెయ్యటానికి ఎంతో సాహసం కావాలన్నాడు.

ఒక ఆడదాని విషయంలో మోసపోయేవాడు ఎందరాడవాళ్ళ విషయంలోనన్నా మోసపోవటానికి సిద్ధంగా ఉంటాడు. మళ్ళీ మరొక విషయంలో మోసపోయేకన్నా ఈ అందగాడు తన విషయంలోనే మోసపోవటం మేలేమోననుకున్నది లక్ష్మి. అందుచేతనే తన "సాహసానికి" పరిస్థితులు ఎట్లా కలిసివచ్చినదీ ఆమె రంగారావుకి వివరించలేదు.

లక్ష్మి రంగారావును పెళ్ళాడటానికి ఒప్పుకున్నందుకు అందరూ సంతోషించారు. అందరికన్నా రంగారావు అధికంగా సంతోషించాడు.

మొదటి ముద్రణ: ఆంధ్రజ్యోతి మాసపత్రిక, జూలై 1954